క్లుప్తంగా

మద్యపాన వ్యతిరేక ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం గ్రామంలో టీకే పరిశ్రమలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కాకినాడ నార్త్ స్టేషన్ ఆధ్వర్యంలో మద్యపానానికి వ్యతిరేకంగా శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మద్యం, మద్యపానం వల్ల వచ్చే దుష్పరిణామాలను కార్మికులకు వివరించారు. నవోదయం – 2.0 కార్యక్రమంలో భాగంగా సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని సీఐ రామ్మోహన్ తెలియజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై వరహాలు, సిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ నేత వేణుగోపాలరావు మృతి

బాలాజీచెరువు: యూటీఎఫ్ సీనియర్ నాయకుడు, గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్ విశ్రాంత హెచ్ఎం వై.వేణుగోపాలరావు (70) మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం తెల్లవారుజామున మరణించారు. ఈయన యూటీఎఫ్ నగర గౌరవ అధ్యక్షుడిగా విశిష్ట సేవలు అందించడంతో పాటు ఉచితంగా హోమియో వైద్యం చేసేవారు. ఆయన మృతికి యూటీఎఫ్ శాఖ సంతాపం తెలిపింది.

పోస్టల్ శాఖలో ఐపీపీబీ ఖాతాల ప్రారంభం

బాలాజీచెరువు: పోస్టల్ శాఖలో ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు పొందడానికి ఐపీపీబీ ఖాతాలకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు పోస్టల్ సూపరింటెంటెంట్ ఆర్.నవీన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఖాతాలకు ఆధార్‌సీడింగ్ లేకపోవడం వల్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పథకాలు నగదు రావడం లేదని, ఆధార్ సీడింగ్‌తో పాటు ఎన్‌పీసీఐ లింకేజీ చేయడం ద్వారా ఖాతాలు తిరిగి పునరుద్ధరించడబడతాయన్నారు. జూన్ 5వ తేదీలోగా గ్రామ, వార్డు స్థాయిలో సచివాలయాల సిబ్బందితో డ్రైవ్ చేపడతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎఫ్‌సీఐ రాష్ట్ర స్థాయి సలహా కమిటీ సభ్యుడిగా వికాస్



మద్దా వికాస్

కాకినాడ రూరల్: ఎఫ్‌సీఐ రాష్ట్ర స్థాయి సలహా కమిటీ సభ్యుడిగా తాను నియమించబడినట్లు రమణయ్యపేట ఆంజనేయనగర్‌కు చెందిన సామాజిక కార్యకర్త మద్దా వికాస్ విలేకరులకు తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేసే తాను సామాజిక కార్యకర్తగా చురుగ్గా పనిచేయడంతో తనకు కమిటీలో స్థానం లభించిదని శనివారం వివరించారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నుంచి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అధికారికంగా ప్రకటించారని, వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

తల్లీబిడ్డలకు వితరణ



తల్లిబిడ్డలకు వస్త్రాలు, సామగ్రిని అందిస్తున్న డీసీపీయూ సోషల్ వర్కర్ చినబాబు, వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది ప్రమీల

కాకినాడ క్రైం: గత మంగళవారం కాకినాడ బస్టాండ్ ఆవరణలో వర్షంలో దీనావస్థలో ఉన్న ఓ తల్లి ముగ్గురు బిడ్డలను డీసీపీయూ పీవో కె.విజయ ఆధ్వర్యంలో బృందం వన్‌స్టాప్ సెంటర్‌కు తరలించి సంరక్షించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 'నా బిడ్డల్ని రక్షించండి' శీర్షికన ఆ తల్లి బిడ్డల నిస్సహాయ స్థితిపై సాక్షి ప్రచురించిన కథనానికి దాతల నుంచి విశేష స్పందన లభిస్తోంది. కథనాన్ని చదివి చలించిపోయిన స్థానిక విశ్రాంత ఉద్యోగి వంకాయల శ్రీనివాస్ తల్లిబిడ్డలకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తంతో డీసీపీవో వెంకట్ ఆధ్వర్యంలో సిబ్బంది బాధిత పిల్లలకు వస్త్రాలు, పాల డబ్బాలు, డైపర్లు సహా అవసరమైన ఇతర సామగ్రిని కొని తల్లికి అందించారు.

అడవి పుంత ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు అడవి పుంత రోడ్డులోని స్థలాన్ని తాండ్ర ఫ్యాక్టరీ యాజమాన్యం ఆక్రమించడంపై ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీల నాయకులు గొల్లప్రోలు తహసీల్దారుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు కుంచె అంజిబాబు మాట్లాడుతూ మామిడి తాండ్ర ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

ధరల దిగబడులు

- దిగుబడి బాగున్నా దక్కని ధర
- అన్నదాతలపై మిల్లర్లు, దళారులు, వర్షాల ముప్పేట దాడి
- రైతు సేవా కేంద్రాల్లో దక్కని భరోసా
- ప్రకటించినది రూ.1725, ఇచ్చేది రూ.1550
- నిలువునా మోసపోతున్న భూమిపుత్రులు



వర్షం తగ్గి, ఎండ రావడంతో కొరుపల్లిలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

కరప: మద్దతు ధర లేక, కొనేవారు లేక ధాన్యాన్ని రాశులుగా పోసుకుని రైతులు దిక్కులు చూస్తున్నారు. ఓ వైపు అకాల వర్షాలు సైతం అన్యాయం చేయడం, దళారుల చేతివాటం, మిల్లర్ల దోపిడీ అన్నదాతను తేరుకోనీకుండా చేస్తున్నాయి. రోజుకూలీ మనిషికి రూ.వెయ్యి, బస్తా ఎరువు రూ.1800. అదే బస్తా ధాన్యం అమ్మితే రూ.1550 ఇస్తున్నారు. ఇక తమకు మిగిలేదేముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 13,313 ఎకరాల్లో రబీ వరి సాగు చేశారు. 80 శాతం ఎంటీయూ 3626(బొండాలు) మిగిలిన 20 శాతం సన్నరకాలు సాగు చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎకరాకు 45 నుంచి 50 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నాయి. సారవంతమైన భూముల్లో 55 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు సాధారణ రకం (కామన్) 75 కిలోల బస్తా రూ.1725, గ్రేడ్–ఎ రకం అయితే రూ.1740 కొనుగోలు చేయాలి. రైస్ మిల్లర్లు, వ్యాపారులు ఆ ధాన్యానికి ధర తగ్గించి బస్తా రూ.1500కు, కొన్ని గ్రామాల్లో రూ.1550కు కొనుగోలు చేస్తున్నారు. ధర పెరిగాక అమ్ముదామనుకుని ధాన్యం రాశులు చేసిన రైతులను ఈ నెలలో రెండుసార్లు కురిసిన వర్షాలు దెబ్బతీశాయి. చేసేది లేక మిల్లర్లు నిర్ణయించిన ధరకే విక్రయించి బస్తాకు రూ.175 నుంచి రూ.225 వరకు నష్టపోతున్నామని రైతులు అంటున్నారు.



ధాన్యం రాశులు తడిసిపోయి మొలకలు వచ్చాయని చూపిస్తున్న వలసపాకల రైతులు

సీఎంఆర్ రూ.1600

రైతు సేవా కేంద్రాల్లో విక్రయిస్తే కనీస మద్దతు ధర 75 కిలోల బస్తాకు రూ.1725 వస్తుందని అధికారులు, నాయకుల మాటలు ఆచరణలో కనిపించడంలేదని రైతులు విమర్శిస్తున్నారు. ఆ కేంద్రాల్లో విక్రయిస్తే మిల్లర్లు రూ.1600 ఇస్తామంటున్నారు. మిగిలిన సొమ్మును ఖర్చుల కోసమని కోసేస్తున్నారని, దీనికీ అంగీకరించి మిల్లుకు వెళ్తే తేమ శాతం పేరుతో ఒకటి, రెండు కిలోల రేటు కోసేస్తున్నారని, అదేంటని ప్రశ్నిస్తే ధాన్యం వెనక్కి పట్టుకుపొమ్మంటున్నారని రైతులు అంటున్నారు. దీంతో ధాన్యాన్ని వెనక్కు తేలేక వారు చెప్పిన ధరకే విక్రయించాల్సి వస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు.

బస్తా ధాన్యానికి బస్తా ఎరువు రావడంలేదు



రోజుకూలీ మనిషికి రూ.వెయ్యి ఇస్తున్నాం. ఎరువుల బస్తా కొనాలంటే రూ.1850 అవుతోంది. 75 కిలోల ధాన్యం బస్తా రూ.1550కు అడుగుతున్నారు. ఒకబస్తా ధాన్యం అమ్మితే ఒక ఎరువుల బస్తా కూడా రావడంలేదు. పెట్టుబడులు పెరిగిపోయి, వ్యవసాయం కిట్టుబాటు కావడంలేదు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానం చేస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– రెడ్డి వెంకటరమణ, కౌలురైతు, కొరుపల్లి

తగ్గిన ధరలతో నష్టపోయా..



ఐదు ఎకరాల్లో వరి సాగుచేశా. దిగుబడులు బాగా వచ్చాయి. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మిల్లర్లు ధాన్యం ధర తగ్గించి కొంటున్నారు. రైతు సేవాకేంద్రాలలో కొనుగోలుచేయక మిల్లర్లు చెప్పిన రేటుకే అమ్ముకోవాల్సి వస్తోంది. వర్షం ఆగడంతో 75 కిలోల బస్తా రూ 1550 లకు వ్యాపారులకు బేరం ఇచ్చాను. మద్దతు ధర ఇవ్వక రూ.43 వేలు వరకు నష్టపోయాను.

– మేడిశెట్టి శ్రీను, కౌలురైతు, వలసపాకల

దిగుబడులు బాగున్నా రేటులేక నష్టపోతున్నాం



గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దిగుబడులు పెరిగాయి. ఆరు ఎకరాలు సాగుచేశాను. పంట బాగా పండింది, ఈ ఏడాది నాలుగు రూకలు మిగులుతాయనుకుంటే మిల్లర్లు రేటు తగ్గించేశారు. రైతు సేవాకేంద్రంలో అమ్ముదామంటే మిల్లర్లు బస్తాకు ఒక కేజీ కటింగ్ అంటున్నారు. వర్షానికి రాశి అడుగున తడిసిపోయి, మొలకలు రావడంతో ఆ అవస్థలు పడలేక మిల్లర్లు చెప్పిన రేటుకే అమ్ముకోవాల్సి వచ్చింది.

– వాసంశెట్టి వీరబాబు, కౌలురైతు, వలసపాకల

వర్షాలకు మొలకలు

ధాన్యం దిగుబడి బాగుందనుకున్న రైతును అకాల వర్షాలు బాగా దెబ్బతీశాయి. ఈ నెలలో రెండు సార్లు కురిసిన వర్షాలకు ధాన్యంరాశులు, పనపై తడిసి నష్టం వాటిల్లింది. యంత్రపరికరాలతో కోయించిన పంటను రోడ్లపైకి, లే అవుట్లలోకి తీసుకు వచ్చి ఎండపెట్టుకున్నారు. అదేసమయంలో అకాలవర్షాలు రావడంతో ధాన్యం రాశులు తడిసిపోయాయి. దీంతో ధాన్యం రాశుల అడుగు భాగాన నీరు చేరి ఒక్కోరాశికి రెండు బస్తాల వరకు మొక్కలు వచ్చి పనిచేయకుండా పోయాయని రైతులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ కార్యదర్శిగా రిక్కీ గూటం



బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కాకినాడ సిటీ నియోజకవర్గానికి చెందిన గూటం జాన్ (రిక్కీ గూటం)ను రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగం కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా రిక్కీని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు.

నేడు ఉచిత డీఎస్సీ మోడల్ గ్రాండ్ టెస్ట్



మోడల్ టెస్ట్ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): యంగ్‌మైండ్ రేపటి తరంకోసం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం ఉచిత డీఎస్సీ మోడల్ గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు వాకాడ వెంకటరమణ తెలిపారు. స్థానిక విద్యుత్‌నగర్ శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో శనివారం పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు తయారుచేసిన మోడల్ పేపర్ వాల్‌పోస్టర్ శ్యామ్‌తో కలిసి ఆవిష్కరించారు. దీని ద్వారా అభ్యర్థులు తమ ప్రతిభను బేరీజు వేసుకోవచ్చన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గంట ముందుగా పరీక్ష కేంద్రం శ్యామ్ ఇనిస్టిట్యూట్‌కు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు చింతాడ ప్రదీప్‌కుమార్, రాష్ట్ర సభ్యులు జీవీ సుబ్బారావు, డీవీవీ బాపిరాజు, ఇనిస్టిట్యూట్ సీఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి అహల్యాబాయి కృషి



రాణి అహల్యాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్

బోట్‌క్లబ్: దేశంలో ప్రసిద్ధ హిందూ దేవాలయాల అభివృద్ధికి రాణి అహల్యాబాయి ఎంతో కృషి చేశారని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. స్థానిక సూర్య కళామందిరంలో శనివారం రాణి అహల్యాబాయి 300వ జయంతి వేడుకలు జిల్లా బీజేపీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాధవ్ మాట్లాడుతూ రాణి అహల్యాబాయి హోల్కర్ మరాఠాలు పరిపాలించిన మాల్వా సామ్రాజ్యంలో 1725 మే 24న జన్మించారన్నారు. హైందవ సంబంధ కార్యక్రమాలు నిర్వహించి పేరు ప్రఖ్యాతులు సాధించారన్నారు. రాణి అహల్యాబాయి ఇండోర్, మహేశ్వర్ ప్రాంతాల్లో అనేక హిందూ దేవాలయాలు నిర్మించారని, అనేక పవిత్ర స్థలాల్లో ధర్మశాలలు నిర్మించారన్నారు. ద్వారక మొదలుకొని వారణాసి, ఉజ్జయిని, నాసిక్, గయ, వైద్యనాథ్ ఆలయం వంటి ప్రాంతాల్లో ధర్మశాలలు నిర్మించారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వేటుకూరి సూర్యనారాయణరాజు, పెద్దిరెడ్డి రవికిరణ్, పైడా కృష్ణమోహన్, యార్లగడ్డ రామ్‌కుమార్, గౌతు చిన్న పాల్గొన్నారు.

రేపు సమైక్యతా ర్యాలీ

కాకినాడ సిటీ: దేశ సమైక్యత, సార్వభౌమత్వం వర్ధిల్లాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం సమైక్యతా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉగ్రవాదం, మతోన్మాదాలకు వ్యతిరేకంగా దేశ ప్రజలంతా దేశ సమైక్యత కోసం నిలబడాలని సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మే 20 నుంచి 30 వరకు సమైక్యత యాత్రలు జరుగుతున్నాయన్నారు. దీనిలో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు కాకినాడ జీజీహెచ్ ఎదురుగా ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నుంచి ఇంద్రపాలెం వంతెన బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వరకు జరుగుతున్న సమైక్యతా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీ జయప్రదం చేయాలని వీరబాబు కోరారు.

సోదర బంధాన్ని బలోపేతం చేసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరాజు

కాకినాడ రూరల్: సోదర బంధాన్ని బలోపేతం చేసుకోవాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణరాజు పేర్కొన్నారు. జాతీయ సోదరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రమణయ్యపేటలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సోదరులతో ప్రేమను వ్యక్తపరచడానికి, సోదర భావాన్ని వ్యాప్తి చేయడానికి ఏటా మే 24న ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. గతంలో ఉమ్మడి కుటుంబాల వ్యవస్థలో ప్రతి ఇంటిలో అధిక సంతానంతో సోదరీమణులు, సోదరులు ఉండేవారని, వారి మధ్య ఎటువంటి అరమరికలు లేకుండా సంతోషంగా ఉండేవారన్నారు. తండ్రి తరువాత పెద్దన్నయ్య మొత్తం కుటుంబానికి మార్గదర్శకత్వం వహించే వారని, కానీ నేడు చిన్న కుటుంబాల వల్ల సొంత సోదరులు పరిమితమై స్నేహితులే సోదరులుగా కష్టసుఖాలలో పాలు పంచుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో డాక్టర్ లావణ్యకుమారి చేరిక

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ లావణ్యకుమారి శనివారం తిరిగి విధుల్లో చేరారు. గత నెల 17వ తేదీ తెల్లవారుజామున డాక్టర్ లావణ్యకుమారి గుండెపోటుకు గురయ్యారు. స్టెంట్ వేసిన అనంతరం వైద్యులు విశ్రాంతి సూచించడంతో ఆమె సెలవులో ఉన్నారు. ఈ వ్యవధిలో ఆర్థోపెడిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ అదనపు బాధ్యతల్లో సూపరింటెండెంట్‌గా కొనసాగారు. ఈ నేపథ్యంలో శనివారం సెలవు ముగించుకొని డాక్టర్ లావణ్య కుమారి విధుల్లో చేరారు.

తుల్యభాగ డ్రెయిన్‌లోకి దూకి వ్యక్తి గల్లంతు

కరప: ఆలుమగల కలహాలతో ఒకవ్యక్తి తుల్యభాగ డ్రెయిన్‌లోకి దూకి గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన జెడ్పీ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ పోలిశెట్టి సత్యం (42) గొల్లపాలెంలో బిర్యాని వ్యాపారం చేస్తుంటాడు. స్వామికి అతనితో కొద్ది రోజులుగా కలహాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అతను ఆత్మహత్య చేసుకునేందుకు శనివారం రాత్రి తుల్యభాగ డ్రెయిన్‌లోకి దూకేశాడు. స్వామి గల్లంతవ్వడంతో ఈ విషయం తెలుసుకున్న కరప పోలీసులు కాకినాడ అగ్నిమాపకశాఖ, గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. చీకటిగా ఉండటంతో గాలింపు చర్యల్లో జాప్యం జరుగుతోంది. రాత్రి 10.15 గంటలకు కూడా ఆచూకీ లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు.

శ్రీపాదునికి మధురఫల నివేదన



మామిడి పండ్ల నివేదనలో స్వామివారు

పిఠాపురం: స్థానిక దత్త క్షేత్రమైన శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో స్వామి వారికి శనివారం మామిడిపండ్లతో నివేదించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని భక్తులు దర్శించి పరవశించిపోయారు.

పని మనిషి చేతివాటం

యజమాని ఇంట్లో 22 కాసుల బంగారం చోరీ

కాకినాడ క్రైం: పనిమనిషే తిన్నింటి వాసాలు లెక్కబెట్టింది. యజమాని ఇంట్లో బంగారు ఆభరణాలపై కన్నేసి దొంగతనానికి పాల్పడింది. చివరికి పోలీసులకు చిక్కి కటకటాల పాలైంది. వివరాల్లోకి వెళితే, కాకినాడ విద్యుత్ నగర్ ఎస్‌బీఐ కాలనీకి చెందిన వి.మణి కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో ఉద్యోగి. రమ్య అనే మహిళ నాలుగు నెలలుగా ఆమె ఇంట్లో పనిచేస్తోంది. శుక్రవారం ఉదయం మణి విధులకు వెళుతూ తాళం వేసి తన కుమార్తెతో పాటు, పనిమనిషి రమ్యతో కలిసి ఇంటి నుంచి బయటికి వచ్చింది. తినుబండారాలు వదిలేశానని చెప్పి రమ్య తాళాలు తీసుకొని మళ్లీ ఇంట్లోకి వెళ్లింది. అలా వెళ్లి తినుబండారాలు తనతో బయటకి తెచ్చి తాళం వేశానని చెప్పి తాళం చెవులు మణికి ఇచ్చేసింది. ఆమె తన కుమార్తెతో సహా తాళాలు పట్టుకొని విధులకు వెళ్లిపోయారు. అయితే రమ్య తాళాలు వేయకుండానే వేశాసానని నమ్మబలికి యజమాని వెళ్లిపోయిన కాసేపటికి ఇంట్లోకి వెళ్లి బీరువాలో ఉన్న 22 కాసుల బంగారంతో పాటు ఇతర వెండి ఆభరణాలను దోచుకు వెళ్లింది. సాయంత్రం 5.30 సమయంలో మణి విధులు ముగించుకుని ఇంటికి తిరిగిరాగా తలుపు తాళాలు తీసి ఉండడాన్ని చూసి కంగారు పడింది. బీరువాలో చూడగా బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు మాయమై ఉండడాన్ని గమనించింది. రాత్రంతా ఇల్లంతా జల్లెడ పట్టినా ఇంట్లో ఇంకెక్కడా ఆభరణాల జాడ కానరాలేదు. దీంతో శనివారం ఉదయం కాకినాడ టూ టౌన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా సీఐ మజ్జి అప్పలనాయుడు ఆధ్వర్యంలోని పోలీస్ బృందాలు క్లూస్ టీం సాయంతో వెదుకులాట మొదలు పెట్టాయి. వీరి విచారణలో పనిమనిషి రమ్య పాత్ర తేటతెల్లం అయింది. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేసే సరికి అసలు విషయం బయటపెట్టింది. తానే ఈ దొంగతనం చేశానని ఒప్పుకుంది. దీంతో ఆమె నుంచి చోరీ చేసిన బంగారు, వెండి ఆభరణాలను రికవరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు చేసిన కేవలం నాలుగు గంటల్లోనే బంగారం రికవరీ చేయడంతో పాటు నిందితురాలిని పట్టుకున్నారు. ఈ కేసులో హెడ్ కానిస్టేబుల్ శ్రీరామ్ కీలకంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో ఎస్పీ సీఐ అప్పలనాయుడు, హెచ్‌సీ శ్రీరామ్‌ల బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఫిర్యాదుదారు మణి ఎస్పీ సహా అప్పలనాయుడు బృందానికి ధన్యవాదాలు తెలిపారు. ఘటనపై కాకినాడ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్సైజ్ అధికారుల విస్తృత తనిఖీలు



యానాం మద్యంతో పట్టుబడిన ముద్దాయిలతో ఎక్సైజ్ పోలీసులు

తాళ్లరేవు: ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరెంటెండెంట్ కె. విజయమౌనిక, తాళ్లరేవు ఎక్సైజ్ సీఐ కె.కోటేశ్వరరావు బృందం శుక్రవారం రాత్రి విస్తృత తనిఖీలు నిర్వహించారు. కాకినాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ డా ఏనుగుల చైతన్య మురళి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ తనిఖీల్లో రెండు కార్లు, ఒక మోటార్ సైకిల్‌పై కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న నలుగురిని అరెస్ట్ చేసారు. నూకవల్లి అరుణ్‌కుమార్, దున్నా మోహన్, దోనం ఆదిసత్యనారాయణ, వీరాస్వామి మార్కస్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 750 ఎం.ఎల్ సీసాలు 33, 180 ఎం.ఎల్ 5, బీరు బాటిళ్లు 12 స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం తరలింపునకు వినియోగించిన రెండు కార్లు, మోటార్ సైకిల్‌ను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ అధికారులు శనివారం తెలిపారు.

రిజిస్ట్రేషన్ శాఖలో అధికారులు ఫోన్ నెంబర్లు..

కాకినాడ జిల్లా పరిధిలో:ఉమ్మడి జిల్లా అధికారులు, కాకినాడ జిల్లా సబ్‌రిజిస్ట్రార్లు....

ఉమ్మడి జిల్లా డీఐజీ	ఎస్.మాధవి	(7093921397)
ఉమ్మడి జిల్లా మార్కెట్ అండ్ ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్	జె.జయలక్ష్మి	(7093921417)
కాకినాడ జిల్లా రిజిస్ట్రార్	జె.జయలక్ష్మి (ఇన్‌చార్జి)	(7093921399)
కాకినాడ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్–1	ఆర్.వి .రామారావు	(7093921405)
కాకినాడ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్–2	పి.ఎస్.వి.ఎస్.ఎస్.వీరభద్రరావు	(7093921406)
సర్పవరం సబ్‌రిజిస్ట్రార్	వి.శ్రీనివాస్	(7093921413)
జగ్గంపేట సబ్‌రిజిస్ట్రార్	సీహెచ్.రమేష్‌బాబు	(7093921404)
పెద్దాపురం సబ్‌రిజిస్ట్రార్	పి.విజయలక్ష్మి	(7093921408)
పత్తిపాడు సబ్‌రిజిస్ట్రార్	వి.వి.డెనియల్	(7093921410)
సామర్లకోట సబ్‌రిజిస్ట్రార్	బి.వి.వి సత్యనారాయణ	(7093921412)
పిఠాపురం సబ్‌రిజిస్ట్రార్	వి.రమాదేవి	(7093921409)
తాళ్లరేవు సబ్‌రిజిస్ట్రార్	పి.శారద	(7093921415)
తుని సబ్‌రిజిస్ట్రార్	టి.సుబ్బారెడ్డి	(7093921416)
కాకినాడ డీఐజీ కార్యాలయంకు సబ్‌రిజిస్ట్రార్	ఆర్.శ్రీనివాసరావు	(7093921398)
కాకినాడ మార్కెట్ అండ్ ఆడిట్ సబ్‌రిజిస్ట్రార్	ఎ.శ్రీనివాస్	(9848453534)
కాకినాడ చిట్ సబ్‌రిజిస్ట్రార్	ఎ.సునందశ్రీ	(7093921400)

భూములు తీసుకుంటే ఆత్మహత్యలే శరణ్యం

- గోర్స గ్రామస్తుల హెచ్చరిక
- లింకు పత్రాలు తమ వద్ద ఉండగా స్వాధీనం కుదరదంటున్న బాధితులు



భూముల వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

కొత్తపల్లి: సాగు చేసుకుంటున్న భూములను దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని గోర్స సీతారామ ఆలయానికి సంబంధించి కొమరగిరి రెవెన్యూ పరిధిలో ఉన్న వివాదాస్పద భూముల వద్ద సాగు చేస్తున్న రైతులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 121, 122లో గల 19.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడానికి అధికారులు ప్రయత్నిస్తే మూకమ్మడిగా రైతులు అందరూ ఆత్మహత్యలకు పాల్పతామని హెచ్చరించారు. గ్రామంలో సీతారామ స్వామి ఆలయ భూములని చెబుతున్న భూములన్నీ తమ పేరున ఉన్నాయని, ఆయా భూములు ఎవరినుంచి వచ్చాయనే లింకు పత్రాలు తమ వద్ద ఉండగా దేవదాయశాఖకు చెందిన భూములని అధికారులు హెచ్చరించడమేమిటని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ భూమి తమ స్వాధీనంలో ఉందన్నారు. దేవదాయ శాఖకు చెందిన భూములైతే ఇన్నేళ్ల నుంచి ఏం చేశారంటూ రైతులు ప్రశ్నించారు. తమ పేరుపై ఉన్న భూములను తమ పిల్లలకు కట్నకానుకలుగా ఇచ్చామని, ఇపుడు ఆ భూములను స్వాధీనం చేసుకుంటే వారి భవిష్యత్ ఏమిటని ప్రశ్నించారు.

స్వాధీనం చేసుకోకుంటే ఆమరణ నిరాహార దీక్ష

సీతారామ ఆలయం వద్ద గ్రామస్తులు, భక్తుల ఆందోళన

కొత్తపల్లి: అన్యాక్రాంతమైన దేవాలయ భూములను దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకోకపోతే గ్రామస్తులు అంతా కలిసి ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధంగా ఉన్నామని సర్పంచి రొంగల వీరబాబు అన్నారు. ఈ మేరకు మండలంలోని గోర్స గ్రామంలో ఉన్న పురాతన సీతారామ ఆలయం వద్ద శనివారం వారు ఆందోళన నిర్వహించారు. కాకినాడలోని దేవదాయ శాఖ అధికారిని కలవడం జరిగిందని, సీతారామ ఆలయానికి సంబంధించిన భూములు సర్వే నెంబర్ 121, 122లో గల 19.92 ఎకరాలను శనివారం స్వాధీనం చేసుకుంటామని చెప్పారన్నారు. దీనికి సంబంధించి పోలీసులు, 108 వాహనం కూడా వచ్చాయని, కొంత సమయానికి తిరిగి వెళ్లిపోవడంలో ఆంతర్యమేమిటని వారు ప్రశ్నించారు. దేవుడి భూమి దేవుడికి దక్కే వరకూ పోరాటం ఆగదన్నారు. వారం రోజుల్లో పరిష్కారం చూపిస్తామని దేవదాయ అధికారులు చెపుతున్నారన్నారు.